# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక


## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 179 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 23 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## ముదిరాజులను బీసీ-డీ నుంచి ఏ లోకి మారుస్తాం

### ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు

### ముదిరాజులకు ఎమ్మెల్సీ అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లండి

### పండగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

పేదల పక్షాన నిలబడి, దొరల దోపిడీని ఎదిరించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చే అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని ప్రకటించారు. వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. నిజాం పాలనలో భూస్వాములు, దొరలు పేదల భూములను ఆక్రమిస్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పండుగ సాయన్న అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా సాయన్న నిలిచారని ..మిగతా 2లో



## మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

### ప్రధాని మోదీకి ఇజ్రాయిల్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఆహ్వానం

### ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన ఇజ్రాయెల్ ప్రధాని

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. భారత్‌తో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని మోదీని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆహ్వానించారు. భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో జ్యోతి వెలిగించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ..మిగతా 2లో

### కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు

## అధికారం లేనట్టే

### కాంగ్రెస్‌పై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

రాబోయే 30 ఏళ్ల వరకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నిరసనల వల్ల రాహుల్ గాంధీ సాధించేది ఏమీ ఉండదని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీకి చెందిన సామాన్య బూత్ స్థాయి కార్యకర్త నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అందరూ నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 'ఓట్ చోరీ' ఆరోపణల ముసుగులో ..మిగతా 2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు చర్చలు



### గడ్డం పెంచినా...కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరు

### తెలంగాణలో త్వరలో రాజకీయ తుఫానుకు తెరవెనక బిజెపి కృషి

### నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్

**హైదరాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేక పోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.



రైతు కు మినుముల విత్తనాలను బహుకరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## భవిష్యత్‌లో వ్యవసాయానికే పెద్ద పీట... రైతే రాజు

### ఎల్ నినో నేపథ్యం లో ఆరు తడి పంటలే వేసుకోవాలి

### రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు ప్రారంభ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

5లో..

## భారత్ సైనిక ఎగుమతుల్లో బ్రహ్మోస్ కు భారీ డిమాండ్

### 2027-28 నాటికి 'నెక్స్ట్ జనరేషన్' సిద్ధం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

భారత్ సైనిక ఎగుమతుల్లో 'బ్రహ్మోస్' సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అగ్రభాగాన నిలుస్తోందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో యుద్ధరంగంలో తిరుగులేని సత్తా చాటిన తర్వాత ప్రపంచ దేశాల నుంచి బ్రహ్మోస్‌కు భారీ డిమాండ్ ఏర్పడిందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా బ్రహ్మోస్ పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. 2022లో ఫిలిప్పీన్స్‌తో కుదిరిన తొలి చారిత్రక ఒప్పందంతో మొదలైన ప్రస్థానం ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింత వేగం పుంజుకుందని బ్రహ్మోస్ సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి తెలిపారు. ఈ ఏడాది ఆగ్నేయాసియాలోని మరో రెండు దేశాలు ఇండోనేషియా, వియత్నాంలతోనూ ఒప్పందాలు కుదిరాయని, వీటితో బ్రహ్మోస్ ఎగుమతులు 600 మిలియన్ డాలర్లు దాటనున్నాయని వెల్లడించారు.

**2027-28 నాటికి 'బ్రహ్మోస్ నెక్స్ట్ జనరేషన్' తొలి నమూనా సిద్ధం**

భవిష్యత్ ప్రాజెక్టుల్లో భాగంగా భారత్‌కు చెందిన డి ఆర్ డి ఓ, రష్యా సంస్థ సంయుక్తంగా 'బ్రహ్మోస్–నెక్స్ట్ జనరేషన్ క్షిపణిని అభివృద్ధి చేస్తున్నాయి. పరిమాణంలో చిన్నదిగా, తక్కువ బరువుతో, శత్రు రాడార్లకు చిక్కకుండా ఉండే ఈ అధునాతన క్షిపణి తొలి నమూనా 2027–28 నాటికి సిద్ధమవుతుందని జోషి వెల్లడించారు. ఇది భారత వైమానిక దళ స్ట్రైక్ సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. దీంతోపాటు తొలుత 290 కిలోమీటర్లుగా ఉన్న బ్రహ్మోస్ పరిధిని భవిష్యత్తులో 1,500 కిలోమీటర్లకు పెంచే బృహత్తర ప్రాజెక్టు కూడా ప్రణాళికా దశలో ఉందని తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

గర్భిణుల ఆరోగ్యం,రోగుల వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం):**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. గురువారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి,తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి.రిజిస్ట్రేషన్,చెక్ అప్ వంద శాతం జరిగేలా చూడాలని అన్నారు. సుపత్రిలోని అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని,వర్షాకాలంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రక్తపరీక్షలు,మూత్ర పరీక్షలు,ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసి తక్షణ రోగ నిర్ణయం చేయాలని అన్నారు.అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు.కుక్క కాటు,పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా అవసరమైన మందులు,వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల, బయట పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని,వైద్య అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప రాణి, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజులను బీసీ-డీ నుంచి ఏ లోకి మారుస్తాం

**మొదటి పేజీ తరువాయి...**

గుర్తుచేశారు. ప్రజలకు ధాన్యం పంచడంతో పాటు పేద ఆడబిడ్డలు వివాహాలకు ఆర్థిక సాయం చేసిన ఘనత సాయన్నదని కొనియాడారు. అన్యాయంగా హత్యకు గురైనప్పటికీ వందేళ్లు దాటినా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని సీఎం అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు.

**ప్రభుత్వంలో ముదిరాజ్‌లకు భాగస్వామ్యం**

బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం చేపట్టిందని రేవంత్ రెడ్డి చెప్పారు. కులగణన కారణంగానే వివిధ కులాలు తమ జనాభా, హక్కులపై బలంగా గళం వినిపిస్తున్నాయని తెలిపారు. లెక్కల్లో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి వివరాలు అందిస్తే సవరిస్తామని స్పష్టం చేశారు.

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని సీఎం వెల్లడించారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ఇతర కులాల్లో ఉన్న అపోహలను కూడా తొలగించాల్సి ఉందన్నారు. గతంలో శ్రీహరి ముదిరాజ్‌కు డీసీసీ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశామని నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

"జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం. వందేళ్లలో ఎవరూ చేయని పని మా ప్రభుత్వం పూర్తి చేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. ఎంతమంది ఉన్నారో తెలిసింది కనుకే మీ గళానికి విలువ పెరిగింది. బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. గతంలో జరిగిన తప్పు మరోసారి జరగకుండా చూడాలి. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచించారు. ప్రభుత్వంలో ముదిరాజులను భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మరోవైపు, గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరింత విస్తృతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. బీసీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి అధ్యయనం చేయిస్తామన్నారు. ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

**మొదటి పేజీ తరువాయి...**

నెతన్యాహు గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలను మోదీ ప్రశంసించినట్లు తెలిపారు.భారత ప్రధాని మోదీతో మాట్లాడటం సంతోషంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి వెలిగించాలని మోదీని ఆహ్వానించినట్లు వివరించారు. ఈ ఆహ్వానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారని నెతన్యాహు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. భూమిపై మాత్రమే కాకుండా గగనతలంలోనూ ఇరు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని మోదీ అభిప్రాయపడినట్లు నెతన్యాహు తన పోస్టులో వివరించారు.ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో సాధించిన వృద్ధిని ఇరు దేశాధినేతలు సమీక్షించినట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ నిబద్ధతను ఇరువురు నేతలు పునరుద్ఘాటించారని తెలిపారు. అలాగే పశ్చిమాసియా పరిణిమాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పినట్లు పేర్కన్నారు.

**విమానంలో పైలట్‌పై దాడి**

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073లో ఈ ఘటన జరిగింది. విమాన కాక్‌పిట్‌లో సహ పైలట్ దాడి చేయడంతో భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ విమానంలో 27 మంది చిన్నారులు సహా మొత్తం 174 మంది ప్రయాణికులు ఉన్నారు. కాక్‌పిట్‌లో కత్తితో జరిగిన దాడిలో తీవ్ర గాయాల పాలైనప్పటికీ మచ్చర్ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. దీంతో విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకుని దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా దింపారు.

**ధైర్యసాహసాలకు ప్రశంసలు**

విమానంలో జరిగిన తీవ్ర పరిస్థితుల్లో మచ్చర్ వ్యవహరించిన తీరుపై భారత్, ఇజ్రాయెల్ ప్రధానులు గతంలో ప్రశంసలు కురిపించారు. ప్రయాణికుల భద్రతకు ముప్పు ఏర్పడిన సమయంలో ఆయన చూపిన ధైర్యాన్ని ఇద్దరు నేతలూ అభినందించారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మచ్చర్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అయితే స్మిత్ మచ్చర్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం 'ప్రెసిడెన్షియల్ అవార్డ్ ఫర్ సివిలియన్ హీరోయిజం' పురస్కారాన్ని ప్రకటించింది. ఇది ఆ దేశ అత్యున్నత శౌర్య పురస్కారం.

**భారత్-ఇజ్రాయెల్ సంబంధాలకు మరో గుర్తింపు**

భారత్, ఇజ్రాయెల్ మధ్య రక్షణ, భద్రత, సాంకేతికత సహా పలు రంగాల్లో సహకారం కొనసాగుతోంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పరస్పర సహకారం, భద్రతా అంశాలపై సమన్వయం ఇరు దేశాల సంబంధాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీకి నెతన్యాహు పంపిన ఆహ్వానం దౌత్యపరంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది.



# జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం):**

జిల్లా క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల ఖ్యాతిని నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకాంక్షించారు.మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మధుప్రియ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం వలన మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చాటితే యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ క్రీడా కోటాలో రిజర్వేషన్స్ కల్పించడం జరుగుతోందన్నారు. మధుప్రియ వాలీబాల్ తో పాటు ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, స్వప్న, విద్యార్థిని తల్లిదండ్రులు నాగార్జున, సోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# వాల్మీకి ఎస్టీ సాధన సంకల్ప ర్యాలీ కర్రపత్రాలు విడుదల చేసిన దేవదుర్గ ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

ఈనెల 24న జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న "వాల్మీకి ఎస్టీ సాధన సంకల్ప ర్యాలీ"ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కే.టి.దొడ్డి మండలం వాల్మీకి సేవా సమితి , వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు కర్ణాటక రాష్ట్రం దేవదుర్గ ఎమ్మెల్యే కర్రెమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే.టి.దొడ్డి మండల వాల్మీకి సేవా సమితి , ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, గద్వాల్‌లో జరిగే మహా ర్యాలీకి ముఖ్య అతిథిగా విచ్చేసి విజయవంతం చేయాలని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు.



**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు యోహాను (యేసు). ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు శాలువా తో సన్మానం చేశారు.**

# కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు అధికారం లేనట్టే

**మొదటి పేజీ తరువాయి...**

ముసుగులో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో ఉన్న అక్రమ చొరబాటుదారులను కాపాడేందుకు, వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని దేశ ప్రజలంతా గ్రహించారని విమర్శించారు. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా వస్తే న్యాయమని, వ్యతిరేకంగా వస్తే న్యాయ వ్యవస్థనే ప్రశ్నించడం రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. గత 30 ఏళ్లలో ఢిల్లీని పాలించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు యమునా నదిని మురుగుకు నిలయంగా మార్చేశాయని, రోజూ వేల టన్నుల వ్యర్థాలను నదిలోకి వదిలిపెట్టాయని ఆరోపించారు. ప్రస్తుతం ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు సమన్వయంతో



పనిచేస్తూ 2029 నాటికి యమునా నదిని సంపూర్ణంగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. పంజాబ్‌లో ఆప్ పాలనలో మాదకద్రవ్యాల వ్యాపారం విపరీతంగా పెరిగిపోయిందని.. 2029 నాటికి అక్కడ డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# విద్యుత్ సరఫరాపై ఎల్‌నినో ఎఫెక్ట్ లేకుండా చూస్తాం: భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత ఉదయం)**

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్



కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.

విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయని... ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి గత ఏడాది సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# సీఎం ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్22(ప్రభాత ఉదయం)**

మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో పండుగ పూట ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో ఎవరికి వారు ఆశిస్తున్న పదవుల కోసం వారి వారి నియోజకవర్గాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళు కావస్తోంది. అప్పటి నుంచి మంత్రి పదవులు సైతం పూర్తిగా భర్తీ కాలేదు. ఈ క్రమంలో నామినేటెడ్ పదవుల విషయమై చెప్పనక్కర్లేదు. పార్టీ అధికారంలోకి వచ్చింది మొదలు నామినేటెడ్ పదవుల కోసం పైరవీలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇంత వరకు ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే సుడా( శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని నియమించడం మినహా మరొకటి చేయలేదు. ఆయన పదవి కాలం కూడా పూర్తైన దశలో పొడిగింపు కోసం చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ఇప్పుడా పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావుతో పాటు పలువురు నేతలు పోటీ పడుతున్నారు. సత్తు మల్లేశంకు ముఖ్యమంత్రితో చనువు ఉన్న నేపథ్యంలో ఆయనకు మాత్రం జిల్లా గ్రంథాలయ చైర్మన్



పదవి కట్టబెట్టారుఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే సుడాతో పాటు, వుడా(వేములవాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం సుడా చైర్మన్‌గా జి. వి. రామకృష్ణ రావును నియమించింది. వుడా చైర్మన్‌గా రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ ముద్దసాని పురుషోత్తం రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆ పదవి కూడా ఖాళీగానే ఉంది. చివరకు ఆ సంస్థ ఉనికిని కూడా కోల్పోయిందని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలు ఉన్నాయి. వాటికి ట్రస్ట్ బోర్డులను కూడా నియమించకపోవడంతో అధికారులదే ఇష్టారాజ్యంగా సాగుతోంది. వీటితో పాటు అనేక మార్కెట్ కమిటీ పదవులు సైతం ఖాళీగా ఉన్నాయి. చిన్న చిన్న ఆలయాలకు సైతం కమిటీలు నియమించాల్సి ఉంది. జెడ్.పి.టి.సి, ఎం.పి.టి.సి ఎన్నికల ప్రస్తావనే లేదు. దీంతో ఆశావహుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. వాస్తవానికి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తే ఇప్పటికీ ఒక పర్యాయం పూర్తయ్యేది. మరో పర్యాయానికి మరి కొంత మందికి అవకాశం లభించేది. మొత్తంగా పోటీ పెరిగింది. మహేష్ కుమార్ గౌడ్ పి.సి.సి. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టింది మొదలు నామినేటెడ్ పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తామని ఎప్పటికప్పుడు ప్రకటిస్తూనే ఉన్నారు. దీంతో ఆయన ప్రకటనలపై కార్యకర్తలు నమ్మకం కోల్పోయారు. ఈసారి ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఆశలు చిగురించాయి. మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలోనూ కార్యకర్తలకు నమ్మకం కుదిరింది. సమయం కూడా ఎక్కువ తీసుకోకుండా దీపావళి నాటికే భర్తీ చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇక పదవులు ఎవరిని వరించనున్నాయో వేచి చూడాల్సిందే.




అలయ్ బలయ్ కార్యక్రమం బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న రవికుమార్ యాదవ్...

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ‘అలయ్ బలయ్’

**రాజకీయాలకు అతీతంగా ప్రజలను ఏకం చేసే ఆత్మీయ సమ్మేళనం**

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్**

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 22, (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం, ప్రజల మధ్య ప్రేమాభిమానాలకు ‘అలయ్ బలయ్’ కార్యక్రమం ప్రతీకగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాజకీయాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆత్మీయంగా ఆలింగనం చేసుకునే ఈ వేడుక తెలంగాణ సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతోందని కొనియాడారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హర్యానా మాజీ గవర్నర్, సీనియర్ జాతీయ నాయకుడు బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘అలయ్ బలయ్’ కార్యక్రమంలో రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నేల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, వాటిని భావితరాలకు అందించేందుకు బండారు దత్తాత్రేయ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.కులమతాలు, రాజకీయ విభేదాలకు తావులేకుండా పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మీయతకు ఐక్యతకు ప్రతిబింబంగా నిలుస్తున్న ‘అలయ్ బలయ్’ వేడుకలు భవిష్యత్తులోనూ మరింత వైభవంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక వేడుకకు తనను ఆహ్వానించిన బండారు దత్తాత్రేయకు ఆయన కుమార్తె విజయలక్ష్మికి రవికుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, గణేష్ ముదిరాజ్, ఆనంద్, రాజేష్, రాము, వినోద్, బాబు, నవీన్, అర్జున్, శ్రీకాంత్, అఖిల్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్ప గుచ్చం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు ఏ సదాలక్ష్మి

## డిప్యూటీ సీఎం భట్టి, స్పీకర్ గడ్డంకు దసరా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమారి అబ్దేశి సదాలక్ష్మి వారి క్యాంపు కార్యాలయాలలో దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న సదాలక్ష్మి

## పండుగ సాయన్న ఆశయాలు కొనసాగిద్దాం: ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 ( ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న సేవలు మరువలేనివని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం పండుగ సాయన్న 174వ జయంతిని పురస్కరించుకుని గురువారం గద్వాలలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ... పేదల కోసం రాబిన్ హుడ్‌గా అవతారం ఎత్తి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేశారన్నారు. పండగ సాయన్న స్ఫూర్తితో ముదిరాజ్ ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చెందాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు వైస్ చైర్మన్ శంకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా డిసిసి హెల్త్ అండ్ వెల్త్ చైర్మన్ నర్సింగ్ రావు, కౌన్సిలర్ రామలింగేశ్వర కాంప్లే, గోవిందు, కౌన్సిలర్స్ మురళి శ్రీను ముదిరాజ్, ఇసాక్, నాయకులు గోవిందు వంట భాస్కర్, వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మన్న, దౌలన్న, మధు, గంట రమేష్, ధర్మనాయుడు, హనుమంతు, జనార్ధన్,రంజిత్ రామకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు, షాషా, పరశురాముడు, చిరు నాగార్జున, నాయకులు, ముదిరాజ్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



## గువ్వలదిన్నె గ్రామ ‘ఫీల్డ్ అసిస్టెంట్’ అక్రమాలపై విచారణ చేపట్టాలి

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం):**

కే.టి.దొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో విబిజి రామ్ జి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పి. వీరన్న అక్రమాలకు, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై వెంటనే విచారణ జరిపి సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గ్రామస్తులు కే.టి.దొడ్డి ఎంపిడిఓ రమణరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న ఫారం ఫండ్స్



లబ్ధిదారుల సంతకాలు తప్పుడు విధానంలో పెట్టి, మస్టర్లు నమోదు చేసి నిధులు కాజేశారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన డబ్బులు తీసుకొని వేరే ఫొటోలు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని తెలిపారు. పనికి వెళ్లే అసలైన కూలీల ఫొటోలు సమయానికి తీయకుండా, కూలీలు లేని చోట అనధికారికంగా డిమాండ్ పెట్టి నిధులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయడానికి ఒక్కొక్కరి నుంచి 500 రూపాయల లంచం అడుగుతున్నారని, కొందరి దగ్గర ఇప్పటికే వసూలు చేశారని ఆరోపించారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఎస్టిమేషన్లు వేసి, రైతులకు తెలియకుండానే పేమెంట్లు చేసుకుంటున్నారని వినతిపత్రంలో వివరంగా పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణచేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.





పండుగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఉన్నతాధికారులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

**బుద్వేల్, అక్టోబరు 22 (ప్రభాత ఉదయం) :**

పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉద్యోగులతో కలసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం):**

కేటిదొడ్డి మండల కేంద్రానికి చెందిన పిల్లి వీరన్న (27) అనే యువ రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారంతెల్లవారుజామున పిల్లి వీరన్న గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ పొలానికి నీరు పారబెట్టడానికి వెళ్లాడు. ఆ సమయంలో వ్యవసాయ మోటారుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో, ట్రాన్స్ఫార్మర్ వద్ద చెక్ చేసేందుకు వెళ్లగా ఎర్త్ కావడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబానికి ఏకైక ఆధారమైన యువ రైతు విద్యుత్ షాక్‌తో అకాల మరణం చెందడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, నాయకులు ఉరుకుందు, గ్రామ సర్పంచ్ నారాయణ, తదితరులు గద్వాల జిల్లా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కేటిదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## గద్వాలలో ఘనంగా ‘స్వేరో డే’ వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 ( ప్రభాత ఉదయం)ప్రముఖ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ జయంతిని పురస్కరించుకుని స్వేరో సుప్రీం డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు, రాష్ట్ర కమిటీ సూచనల ప్రకారం గురువారం గద్వాల పట్టణంలో ‘స్వేరో డే’ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటి సభ్యులు ఎ. దేవన్న మాట్లాడుతూ ”డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యా వ్యవస్థ అభివృద్ధికి, బహుజన విద్యార్థుల ఉన్నతికి చేసిన కృషి అమూల్యమైనదని కొనియాడారు. స్వేరో ఉద్యమ ఆశయాలు, సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవం మరియు సామాజిక చైతన్యమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్రధాన కార్యదర్శి ఎండి నవీద్, నాయకులు గోపాల్ రెడ్డి, కృపా, అజయ్, రఫీ, మన్యం, ప్రవీణ్ కుమార్, శాలిమియా, ఎండి మహబూబ్, ఎండి ముజీఫ్, తిమ్మప్ప, నర్సింహులు, ఎండీ అలీ, జమన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## గోనుపాడు గ్రామంలో యువకుడు ఆత్మహత్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22 ( ప్రభాత ఉదయం)**

గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో శివ (18) అనే యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు.గ్రామస్తులు , పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ తల్లి అంజనమ్మ గురువారం ఉదయం కూలి పనులకు వెళ్లగా, పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి శివ ఉరివేసుకుని మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే శివ ఆత్మహత్యకు పాల్పడటానికి అసలు కారణాలు ఏమిటనేది ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న వెంటనే గద్వాల రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



# ఎమ్మెల్సీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి: మంత్రి శ్రీధర్ బాబు

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం: డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహా రెడ్డి







**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా పరిధిలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. గురువారం రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ నియోజకవర్గాల ఇంచార్జులు , పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనకు మద్దతుగా నిలుస్తూ విద్యావంతులు, ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తమ అమూల్యమైన మద్దతు తెలపాలని కోరారు. రాబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో సన్నద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల, డివిజన్ కమిటీలు పూర్తి చేసుకొని పార్టీని బలోపేతం చేస్తూ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ , ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరీ వెంకట్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, టి. రామ్మోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మనోహర్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, నియోజకవర్గ ఇంచార్జీలు , మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు దార సింగ్ జాదవ్, పీసీసీ నాయకులు, జిల్లా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు వివిధ కమిటి సభ్యులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి దసరాశుభాకాంక్షలుతెలిపిన నాయకులు

### కౌన్సిలర్ లావణ్య లక్ష్మణ్ ఊర్మిళ వెంకట రెడ్డి

**పఠాన్ చెరు, పెద్ద కంజర్ల అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

పఠాన్ చెరు మండలం పెద్ద కంజర్ల నాయకులు విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పఠాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అయిన ఇంద్రేశం మున్సిపాలిటీ, పెద్ద కంజర్ల 2వార్డు కౌన్సిలర్ సారలావణ్య లక్ష్మణ్, 17 వార్డు కౌన్సిలర్ ఊర్మిల వెంకటరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎస్ కె నసీమా బేగం నవాబ్, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి జమ్మి ఆకుల అందజేస్తూ అలింగనం చేసుకొని దసరా పండుగ శుభాకాంక్షలు నాయకులు కార్యకర్తలు అభిమానులు శుభాకాంక్షలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు తెలంగాణ ప్రతీకగా నిలుస్తుందని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సిరి సంపదలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాశం వేణుగోపాల్ రెడ్డి,తూర్పు విష్ణువర్ధన్ రెడ్డి, జొన్నాడ మహేష్, కట్ట మీది శంకర్,కొత్త గొల్ల కృష్ణ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న

### జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాబిన్‌హుడ్ 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు. పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# జలమండలిలో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

### పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పించిన జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి

**ఖైరతాబాద్, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

రాష్ట్ర పండుగ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను 2026 అక్టోబర్ 22వ తేదీ, గురువారం జలమండలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... అన్యాయం, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడి, అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు కృషి చేసిన పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధనకు ఆయన సాగించిన పోరాటం ఆదర్శనీయమని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, సీజీఎం రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పది రోజులుగా సమ్మె..

# అయినా స్పందన కరువు..!

### ఒంటికాలిపై నిలబడి ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరసన

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్22(ప్రభాత ఉదయం)**

హక్కుల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె పది రోజులు దాటినా సమస్యకు పరిష్కారం దిశగా స్పష్టమైన అడుగులు కనిపించడం లేదని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రోజుకో రూపంలో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నుంచి చర్చలకు పిలుపు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఎన్‌హెచ్ఎం జేఏసీ స్పష్టం చేసింది. రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ ప్రాంగణంలో గురువారం సమ్మెలో భాగంగా ఉద్యోగులు ఒంటికాలిపై నిలబడి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. రెగ్యులరైజేషన్,మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఆరోగ్య భద్రత, పీఆర్సీ, 51 శాతం ఇంక్రిమెంట్,ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలక సేవలు అందించే సిబ్బంది తమ భవిష్యత్తుపై భరోసా కోరుతుంటే, ప్రభుత్వంనుంచి స్పందన లేకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.



# శుద్ధి చేసిన నీటిని తాగునీరుయేతర అవసరాలకు వినియోగించేలా జలమండలి చర్యలు








**జలమండలి ఎండి అశోక్ రెడ్డి**

**కోకాపేటలో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలించిన జలమండలి ఎండీ**

**శుద్ధి చేసిన నీటి నాణ్యత పరీక్షలు, ఫలితాలపై సమీక్ష**

**పీసీబీ, జలమండలి సమన్వయంతో నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ**

**పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రధాన కార్యాలయానికి అనుసంధానించాలి**

**ట్యాంకర్లలో నీటి పరిమాణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు**

**అదనపు నీరు వృథా కాకుండా తిరిగి మళ్లించే వ్యవస్థ ఏర్పాటు చేయాలి**

**నీటి నాణ్యత, సరఫరా పరిమాణంపై నిరంతర పర్యవేక్షణ: జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 22(ప్రభాత ఉదయం)**

నగరంలో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు శుద్ధి చేసిన నీటిని తాగునీరు యేతర అవసరాలకు వినియోగించేలా జలమండలి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కోకాపేటలోని గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్లింగ్ స్టేషన్‌లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించిన ఎండీ.. పరీక్షల నిర్వహణ, వివిధ నాణ్యతా ప్రమాణాలు, ఫలితాల నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), జలమండలి సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత ప్రమాణాల ప్రకారం క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు వాటిని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించేలా అనుసంధానించాలని సూచించారు. ఇందుకోసం జలమండలి ఐటీ విభాగంతో సమన్వయం చేసుకుని అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నీటి నాణ్యతకు సంబంధించిన రికార్డులు పారదర్శకంగా, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

అలాగే ట్యాంకర్లలో నింపే నీటి పరిమాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వివిధ సామర్థ్యాల ట్యాంకర్లకు అనుగుణంగా వేర్వేరు ఫిల్లింగ్ పరిమితులను నిర్దేశించి, ప్రతి ట్యాంకర్‌లో నింపిన నీటి పరిమాణంతో పాటు ఫిల్లింగ్ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్ణీత పరిమాణానికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, అదనంగా వచ్చే నీరు వృథా కాకుండా తిరిగి సంబంధిత చెరువులోకి మళ్లించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

శుద్ధి చేసిన నీటిని భవన నిర్మాణ రంగం, పారిశ్రామిక అవసరాలకు, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, ఉద్యానవనాల నిర్వహణ తదితర తాగునీరు అవసరం లేని పనులకు వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ల నిర్వహణలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం, భద్రతా ప్రమాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీ సీజీఎం పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

